

రేషన్ బియ్యం స్వాధీనం

యాదమరి మండలంలో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పోలీసులు దాడులు చేసి, స్వాధీనం చేసుకున్నారు. - 10లో



అధైర్యపడొద్దు.. వచ్చేది మన ప్రభుత్వమే

అధైర్యపడొద్దు.. వచ్చేది మన ప్రభుత్వమేనని, ప్రతి కార్యకర్తకూ న్యాయం చేస్తానని మాజీ సీఎం జగన్ భరోసా ఇచ్చారు. - 10లో



పకడ్బందీగా ఆరోగ్య కార్యక్రమాలు

జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు పకడ్బందీగా చేపట్టాలని డీఎంహెచ్ఓ సుధారాణి సిబ్బందిని ఆదేశించారు. - 10లో

న్యూస్‌రీల్

రేషన్ కార్డులు.. 7 రకాల సేవలకు అవకాశం



జాయింట్ కలెక్టర్ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో పౌరసరఫరాల శాఖకు సంబంధించి రేషన్‌కార్డుల్లో 7 రకాల సేవలకు అవకాశం కల్పించారని జాయింట్ కలెక్టర్ విద్యాధరి అన్నారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో పౌరసరఫరాల శాఖకు సంబంధించిన 7 రకాల రేషన్‌కార్డుల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందులో కొత్తరేషన్ కార్డులు, బియ్యం కార్డులో సభ్యుల చేర్పులు, మార్పులు (బర్త్, పెళ్లి), బియ్యం కార్డు నుంచి సభ్యుల విభజన, బియ్యం కార్డులో సభ్యుల పేర్లు తొలగింపు (మృతులు మాత్రమే), కార్డులు సరెండర్, బియ్యం కార్డులో చిరునామా మార్పు, తప్పుడుగా నమోదైన ఆధార్ సీడింగ్ దిద్దుబాటుకు అవకాశం కల్పించారు. జిల్లాలో ఇప్పటికీ ఏ రేషన్‌కార్డులోను నమోదు కాని అర్హత కలిగిన పేదలు కొత్త రేషన్‌కార్డుకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు కార్డు ఉండి ఏవైనా సవరణలుంటే దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. జిల్లాలో 7,707.484 మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయించగా మే, 2025 నెలకు గాను 8,642.431 మెట్రిక్ టన్నులు కేటాయించినట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏ రేషన్‌షాపులోనైనా బియ్యం ఇంకా అవసరం ఉంటే సంబంధిత తహసీల్దార్ స్పష్టమైన నివేదికను పంపాలని ఆదేశించారు. రేషన్‌కార్డు లబ్ధిదారులు తమకు అందాల్సిన రేషన్ ను సంబంధిత ఎండీయూ వాహన ఆపరేటర్, రేషన్‌షాపు డీలర్ వద్ద పొందాలని జాయింట్ కలెక్టర్ వెల్లడించారు.

విభిన్నప్రతిభావంతులకు ఉచిత డీఎస్సీ శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు ఉచిత డీఎస్సీ శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా విభిన్నప్రతిభావంతుల శాఖ ఏడీ శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో డీఎస్సీకి సన్నద్ధం అవుతున్న విభిన్న ప్రతిభావంతులు ఈ నెల 11 వ తేదీ లోపు www.mdfc.apefss.in (డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎండీఎఫ్‌సీ.ఏపీఈఎఫ్ ఎస్ఎస్.ఇన్) వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 40 శాతం వైకల్యం ఉన్న అంధులు, బధిరులు, శారీరక విభిన్నప్రతిభావంతులు దరఖాస్తులు చేసుకునేందుకు అర్హులని ఆయన వెల్లడించారు.

బోయకొండ హుండీ రాబడి రూ.63.89 లక్షలు



బోయకొండలో హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

చౌడేపల్లి: బోయకొండ గంగమ్మ ఆలయంలో గురువారం నిర్వహించిన హుండీ కానుకలు లెక్కింపు ద్వారా ఆలయానికి రూ.63.89 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి ఏకాంబరం తెలిపారు. హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా నగదు రూ.63,89,617, బంగారం 40 గ్రాములు, వెండి 470 గ్రాములు వచ్చినట్లు పేర్కొన్నారు. విదేశీ కరెన్సీ7 నోట్లు లభించినట్లు తెలిపారు. ఈ ఆదాయం 42 రోజులు భక్తులు హుండీలో సమర్పించిన కానుకలు అని ఈఓ చెప్పారు. అలాగే రణభేరి గంగమ్మ ఆలయ హుండీ ద్వారా రూ.40,463 నగదు ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ శశికుమార్, ఆలయ, బ్యాంకు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విజయవాడలో సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లో అక్రమ తనిఖీలకు నిరసనగా భగభగ మండే భానుడికి దీటుగా పాత్రికేయలోకం కూటమి సర్కారు తీరుపై నిప్పులు చెరిగింది. పత్రికా స్వేచ్ఛ హరింపునకు నిరసనగా పదం పదం కలిపి కదం తొక్కింది. మీడియా గొంతు నొక్కె చర్యలు తగవని గర్జించింది. ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను హరిస్తుందని ధ్వజమెత్తింది.



చిత్తూరులో డీఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న ఏపీయూడబ్ల్యూజే, ప్రెస్‌క్లబ్ నేతలు

కాలకూటమిపై పాత్రికేయ గర్జన

పత్రికా స్వేచ్ఛను హరిస్తున్న ప్రభుత్వం

- సాక్షి ఎడిటర్ నివాసంలో ఖాకీల జులుంపై నిరసన
- చిత్తూరులో డీఎస్పీకి వినతిపత్రం ఇచ్చిన ఏపీయూడబ్ల్యూజే

చిత్తూరు అర్బన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11 నెలల కాలంలో పాత్రికేయులపై దాడులు, తప్పుడు కేసులు బనాయిస్తూ పత్రికా స్వేచ్ఛను హరిస్తోందని ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు లోకనాథన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అశోక్‌కుమార్ ఆరోపించారు. సాక్షి ఎడిటర్ ఆర్. ధనంజయరెడ్డి నివాసంలో పోలీసులు తనిఖీలు చేయడం, అనుమతి లేకుండా సోదాలు చేయడం ఆయన మానసిక స్థైర్యాన్ని దెబ్బతీయడమేనన్నారు. పోలీసుల తీరును నిరసిస్తూ గురువారం ఏపీ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే), చిత్తూరు ప్రెస్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో పాత్రికేయులు నిరసన తెలిపారు. అనంతరం యూనియన్ నాయకులు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిలా ఉన్న మీడియా రంగంపై ఇలా కక్షసాధింపు చర్యలకు పాల్పడడం రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలన్నారు. ధనంజయరెడ్డిపై ఇప్పటికే తప్పుడు కేసులు పెట్టారని, ఇది కోర్టు పరిధిలో ఉండగా.. నేడు ఇంట్లోకి చొరబడి ఆయన కుటుంబ సభ్యులను సైతం ఇబ్బందులు పెట్టడం మంచి పద్ధతి కాదన్నారు. అనంతరం చిత్తూరు డీఎస్పీ సాయినాథ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రమేష్‌బాబు, ఉపాధ్యక్షుడు శివప్రసాద్, ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్, జిల్లా కమిటీ సభ్యులు సురేష్, సీనియర్ పాత్రికేయులు శివ, గజపతి, బాలసుందరం, హరీష్, రాజేష్, సాయి, జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మీడియాపై బెదిరింపు ధోరణి మంచిది కాదు



పలమనేరు ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

పలమనేరు: మీడియాపై పోలీసుల బెదిరింపు ధోరణి మంచిది పద్ధతి కాదని ప్రెస్‌క్లబ్ నేతలు అన్నారు. పోలీసులు విజయవాడలోని సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లోకి ఎలాంటి నోటీసులు లేకుండా చొరబడి అమానుషంగా ప్రవర్తించడాన్ని నిరసిస్తూ పలమనేరు ప్రెస్‌క్లబ్ జర్నలిస్టులు గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ ఇన్‌చార్జ్ ఏఓ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏదో కేసులో ముద్దాయిలు అపార్ట్‌మెంట్‌లో ఉన్నారనే సమాచారంతో ఆ భవన సముదాయంలోని అన్ని ఇళ్లను తనిఖీలు చేస్తున్నామని భయపెట్టడం పద్ధతి కాదన్నారు. గౌరవప్రదమైన ఎడిటర్ బాధ్యతలు నిర్వహిస్తున్న వ్యక్తిపైనే పోలీసులు జులుం ఇలా ఉంటే ఇక రాష్ట్రంలోని సామాన్యుల పరిస్థితి ఎమిటని ప్రశ్నించారు. ఆయన వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించడంతోపాటు సమాజంలో ఆయన పరువు ప్రతిష్టలకు విఘాతం కల్పించే రీతితో పోలీసులు వ్యవహరించడం తగదన్నారు. ఎలాంటి కేసులు లేకున్నా కేవలం సాక్షి మీడియాను అణగదొక్కేందుకు ఇలాంటి దాడులు చేయడం సమంజసం కాదన్నారు. ఇది కేవలం సాక్షి ఎడిటర్‌పై మాత్రమే జరిగింది కాదని, భవిష్యత్తులో మొత్తం మీడియాపై ఇలాంటి ఆంక్షలు, దాడులు, బెదిరింపులు కొనసాగే పరిస్థితి ఈ కూటమి ప్రభుత్వంలో కనిపిస్తోందన్నారు. ప్రజాసామ్యంలో నాలుగో స్తంభమైన మీడియా పరిరక్షణకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వాలే ఇలాంటి దిగజారుడు చర్యలు దిగడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో పలమనేరు వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్యామ్, దిలీప్, రెడ్డెప్ప, మణి, రమేష్, మోహన్‌మురళి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న డీఆర్వో మోహన్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఈ నెల 12వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని డీఆర్వో మోహన్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి పలు శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 12 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. సంబంధిత శాఖల అధికారులు పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 35 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ పరీక్ష కేంద్రాల్లో 170 కళాశాలలకు సంబంధించి ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 10,236, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 3,724, ఒకేషనల్ మొదటి సంవత్సరం 810, ద్వితీయ సంవత్సరం 607 మొత్తం 15,377 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. వీరందరికీ పరీక్షల సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేసి, గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను మూసి వేయించాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించాలని తెలిపారు. పరీక్షల సమయంలో విద్యార్థుల రాకపోకలకు సమస్యలు లేకుండా ఆర్టీసు బస్సులు సకాలంలో నడపాలన్నారు. విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. అత్యవసర వైద్యసేవలకు కేంద్రాల వద్ద ఏఎన్ఎంలను నియమించాలన్నారు. మొదటి సంవత్సరం పరీక్ష ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్ష మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. జనరల్, ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు మే 28 నుంచి జూన్ 1వ తేదీ వరకు నిర్వహిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్ఐఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జాబితాలో మృతుల ఓట్లు తొలగించండి



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఓటర్ల జాబితాలో మృతుల ఓటర్లను తొలగించేందుకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పారదర్శక ఓటర్ల జాబితా తయారీకి చర్యలు చేపట్టాలన్నారు. బీఎల్వోలు క్షేత్రస్థాయిలో వైద్యఆరోగ్య శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని మృతుల ఓట్లను తొలగించాలన్నారు. జిల్లాలో ఎన్‌సీడీ 3.0 సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఈ సర్వేలో ప్రతి కుటుంబంలోని వివరాలను సేకరిస్తున్నారన్నారు. ఫారం 6 కు 3,595 దరఖాస్తులు అందగా 2,297, ఫారం 7 లో 3,034 దరఖాస్తులు అందగా అందులో 1,889, ఫారం 8 లో 5,304 దరఖాస్తులకు 4,177 దరఖాస్తులు పరిష్కరించినట్లు తెలిపారు. మృతి చెందిన, మల్టిపుల్ ఓటర్లను జాబితాను తొలగించేలా, త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు వస్తుండడంతో నూతన ఓటర్లకు కార్డుల పంపిణీ, ఒక నియోజకవర్గం నుంచి మరో నియోజకవర్గానికి ఓటర్ల జాబితాలో పేర్ల మార్పునకు సంబంధించిన అంశాలను పరిశీలించాలని వివిధ పార్టీల ప్రతినిధులు కోరారు. ఈ సమావేశంలో డీఆర్వో మోహన్‌కుమార్, వైఎస్సార్ సీపీ పార్టీ తరపున ఉదయ్‌కుమార్, ఇతర పార్టీల నుంచి బాలసుబ్రహ్మణ్యం, సురేంద్రకుమార్, యశ్వంత్, అట్లూరి శ్రీనివాసులు, పరదేశి, భాస్కర్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ వాసుదేవన్ పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీ పరీక్షలకు 608 మంది హాజరు

తిరుపతి అర్బన్: జిల్లాలో ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ రాత పరీక్షకు గురువారం 608 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 911 మంది అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా.. వారిలో 303 మంది గైర్హాజరైనట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు.

గవర్నమెంట్ మేనేజ్‌మెంట్ తాత్కాలిక సీనియారిటీ జాబితా విడుదల


చిత్తూరు కలెక్టరేట్ : జోన్-4 పరిధిలోని చిత్తూరు జిల్లా గవర్నమెంట్ మేనేజ్‌మెంట్ స్కూల్ అసిస్టెంట్ కేడర్ నుంచి గ్రేడ్ 2 హెచ్ఎం ఉద్యోగోన్నతుల సీనియారిటీ జాబితా విడుదల చేసినట్లు వైఎస్సార్ కడప జిల్లా ఆర్జేడీ శామ్యూల్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జోన్-4 పరిధిలోని ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని గవర్నమెంట్ మేనేజ్‌మెంట్‌లో స్కూల్ అసిస్టెంట్ తాత్కాలిక సీనియారిటీ జాబితా విడుదల చేశామన్నారు. ఈ జాబితా www.rjdsekadapa.blogspot.comలో నమోదు చేసినట్లు తెలిపారు. సంబంధిత జాబితాలో ఏవైనా అభ్యంతరాలుంటే ఈ నెల 10వ తేదీలోపు తగిన ఆధారాలతో చిత్తూరు డీఈఓ కార్యాలయంలో అందజేయాలన్నారు.

13న విభిన్న ప్రతిభావంతులకు జాబ్ మేళా

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుచానూరు రోడ్డు, పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో గల ఉప ఉపాధి కార్యాలయంలో ఈ నెల 13వ తేదీ ఉదయం 10 గంటలకు విభిన్న ప్రతిభావంతులకు జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఆ మేరకు జూనియర్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ ఎస్.వెంకటరమణ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ జాబ్ మేళాలో ఎస్ఆర్‌కేర్, జాగృతి ఎస్ఆర్ సర్వీసెస్, కేఎఫ్‌సీ సంస్థల ప్రతినిధులు పాల్గొని ఆయా సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. పది పాస్/ఫెయిల్, ఇంటర్, డిగ్రీ, బీటెక్ విద్యార్హత కలిగి 18 నుంచి 30 ఏళ్లలో ఉన్న స్త్రీ, పురుషులు అర్హులని పేర్కొన్నారు.

నేలపై మాయం.. స్కెచ్‌లో దర్శనం

- రాజు కాలువ కబ్జా కథ



లే అవుట్ స్కెచ్‌లో చూపిన రాజుకాలువ



రాజుకాలువను ఆక్రమించి వేసిన లే అవుట్

కుప్పంరూరల్: కూటమి ప్రభుత్వం రాగానే రియల్ ఎస్టేట్ వ్యాపారానికి రెక్కలు వచ్చాయి. కొంత మంది అక్రమార్కులు అనుమతులు లేకుండా లే అవుట్లు వేస్తుండగా, మరికొంత మంది చుట్టు పక్క ఉన్న డీకేటీ, ప్రభుత్వ స్థలాలు, రాజు కాలువలను కలుపుకుని లే అవుట్ వేశారు. ప్రశ్నించాల్సిన అధికారులు ఏటు వైపు నుంచి ఒత్తిళ్లు వస్తాయోనని మిన్నకుండిపోతున్నారు. దీంతో కాలువలు, ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయి. కుప్పం పట్టణానికి అనుకుని ఉన్న ఏరియా ఆస్పత్రి ఎదురుగా ఉన్న చీమనాయనపల్లి రెవెన్యూ గ్రామం సర్వే నంబర్ 99/3లో కొంత మంది రియల్ వ్యాపారులు లే అవుట్ వేశారు. జాతీయ రహదారికి అనుకుని ఉన్న ఈ స్థలం ఎంతో విలువైనదిగా గ్రహించిన రియల్టర్లు 99/3లో ఉన్న రాజు కాలువను సైతం ఆక్రమించుకున్నారు. రాజు కాలువ వారు కొనుగోలు చేసిన స్థలం మధ్యన ఉండడంతో మట్టి పోసి రాజుకాలువను మాయం చేశారు. గుట్టుచప్పుడు కాకుండా లే అవుట్ రాళ్లను పూడ్చి అమ్మకానికి సిద్ధం చేశారు. రాజుకాలువ నేలపై మాయమై, లే అవుట్ స్కెచ్‌లో ప్రత్యక్షమైంది. ఇలా కాలువ పూడ్చి వేసి, విలువైన స్థలాన్ని రికార్డుల్లో మాత్రం అలాగే ఉంచారు. దీంతో భారీ వర్షాలు వస్తే నీరు బయటికి పోకుండా అక్కడే నిలువ ఉండిపోయే ప్రమాదం ఉంది. నివాస గృహాలు ఏర్పాటు చేసుకుంటే ఎగువ నుంచి వచ్చే నీరు బయటికి పోలేక సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ప్రమాదం ఉందని తెలిసి, అందులోను నిత్యం రాష్ట్రం, జిల్లాస్థాయి అధికారులు రాకపోకలు సాగించే జాతీయ రహదారి పక్కన విలువైన రాజుకాలువను అక్రమిస్తే రెవెన్యూ అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. కడా పీడీ అయినా స్పందించి రాజుకాలువను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఆయిల్ పామ్ సాగుతో అధిక దిగుబడి


మాట్లాడుతున్న జిల్లా ఉద్యానవన శాఖ అధికారి

గంగాధర నెల్లూరు: తక్కువ పెట్టుబడితో ఆయిల్ పామ్ సాగు చేసి అధిక దిగుబడులు పొందవచ్చని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఆయిల్ పామ్ రైతుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆయిల్ పామ్ సాగు చేసిన నాలుగేళ్లకే రైతులు లాభాల బాట పడతారని, అంతవరకు అంతర పంటలతో రైతులు దిగుబడులు పొందవచ్చన్నారు. ఆయిల్‌పామ్ అన్ని రకాల నేలల్లో సాగు చేసుకోవచ్చని, రైతులకు మొక్కలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పీడీ బాల సుబ్రమణ్యం, మండల ఉద్యాన అధికారి లోకేష్, వ్యవసాయధికారి భవాని పాల్గొన్నారు.

మద్యం షాపులో ఘర్షణ

- ఎనిమిది మందిపై కేసు నమోదు

నగరి : నగరి సమీపంలోని కీళపట్టు వద్ద బుధవారం రాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణ కేసులో 8 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ విక్రమ్ గురువారం తెలిపారు. ఒక వర్గంలో అమృతరాజ్ నాడార్, మైకెల్ సహ నలుగురిపైన, మరో వర్గంలో కుమరేశన్, రాజా సహ నలుగురిపై కేసు నమోదు చేశామన్నారు. మద్యం షాపులో జరిగిన చిన్న గొడవ చిలికి చిలికి రెండు వర్గాల ఘర్షణకు దారి తీసిందన్నారు. కేసును డీఎస్పీ పర్యవేక్షిస్తున్నారన్నారు.

బాలుడిపై కుక్కల దాడి

పుంగనూరు: పట్టణంలోని దూళ్లవాళ్లఇండ్లలో నాలుగేళ్ల బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. గురువారం ఇంటి వద్ద ఆడుకుంటున్న బాలుడిని కుక్కలు కరిచాయి. గాయపడిన బాలుడిని స్థానికులు గుర్తించి బాలుడిని తల్లిదండ్రులతో కలసి ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాలుడు చికిత్స పొందుతున్నాడు.

ఢీసీసీబీ

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ పదవి పచ్చనేతల మధ్య చిచ్చు పెట్టింది. కూటమి సర్కారు ఆ పదవిని ఓ నేతకు కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేసినా.. ఆ కుర్చీని ఆశిస్తున్న ఆశావహులు కేటాయింపు చెల్లదని.. దాన్ని రద్దు చేసి, తమకే ఇవ్వాలని ఓ సీనియర్ నేత వర్గం పట్టుపడుతోంది. దీంతో డీసీసీబీ కుర్చీకి కుమ్ములాట జరుగుతోంది.

- డీసీసీబీగా చైర్మన్ పదవి అమాస రాజశేఖర్‌రెడ్డికి కేటాయింపు
- జీర్ణించుకోలేని తమ్ముళ్లు
- మంత్రిని నిలదీసిన మాజీ ఎమ్మెల్సీ పలువురు నేతలు
- పార్టీలోని సీనియర్లకు ఇవ్వాలి డిమాండ్



డీసీసీబీ కార్యాలయం

చితూరు రూరల్ (కాణిపాకం): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) చైర్మన్ పదవి కేటాయింపు జరిగినా ఆ కుర్చీపై తెలుగు తమ్ముళ్లు ఢీ అంటే ఢీ అని కుమ్ములాడుతున్నారు. దీంతో పదవి దక్కించుకున్న అమాసకు ఆదిలోనే హంసపాదు ఎదురైంది. ఆ పేరును కూటమి ప్రభుత్వం ప్రకటించినా.. సొంత పార్టీ నేతలే తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఏకంగా రాష్ట్ర రవాణాశాఖ మంత్రిని నిలదీశారు. చైర్మన్ పదవిని మార్చాలని డిమాండ్ చేస్తున్నారు.

మాజీ ఎమ్మెల్సీ ఆశించినా..

డీసీసీబీ పదవిని టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు ఆశించారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆయన ఈ పదవిని ఆశిస్తున్నారు. దీంతో డీసీసీబీ చైర్మన్ పదవి దొరబాబుకే వస్తుందని అందరూ ఊహించారు. ఆయన అనుచరులతోపాటు, డీసీసీబీ అధికార వర్గం సైతం చైర్మన్ కుర్చీ దొరబాబుకేనని అనుకున్నారు. అయితే చివరి నిమిషంలో ఆయనకు కాకుండా ఎవరూ ఊహించని విధంగా అమాసకు చైర్మన్ పదవి కేటాయిస్తూ కూటమి ప్రభుత్వం గట్టి షాకిచ్చింది.


అమాస రాజశేఖర్‌రెడ్డి


దొరబాబు

మళ్లీ అమాసకే...

కూటమి ప్రభుత్వం గతనెల 28వ తేదీన అమాస రాజశేఖర్‌రెడ్డికి డీసీసీబీ పదవిని కట్టబెడుతూ ఉత్తర్వులు జారీ చేసింది. 2006 నుంచి 2019 మధ్యకాలంలో పలుమార్లు ఈయనే చైర్మన్ కుర్చీలో కూర్చున్నారు. 13 ఏళ్ల పాటు డీసీసీబీ పదవిని అనుభవించారు. మళ్లీ ఈ పదవిని అమాసకు కట్టబెట్టేందుకు కూటమి నేతలు నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి, నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, పలమనేరు ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డి, నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ చక్రం తిప్పారనే వాదనలు గట్టిగా వినిపిస్తున్నాయి. దీనికి తోడు గతంలో బ్యాంకు తరఫు రూ.కోటి చెక్కును అందించిన విషయం, కుప్పంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు బ్యాంకు నిధులు కేటాయింపు అమాసకు కలిసొచ్చిందని కొందరు సొంత పార్టీ నేతలే విమర్శలు గుప్పిస్తున్నారు. ఆయన పదవి కాలంలో అవసరం లేని భవన నిర్మాణం, వాస్తు దోషం పేరుతో గుడి నిర్మించిన ఘనత, రైతుల ధనం దుర్వినియోగం చేశారనే ఆరోపణలను మళ్లీ వారు వేలెత్తి చూపుతున్నారు.

అమాసకు ఎలా ఇస్తారు?

అమాసకు మళ్లీ డీసీసీబీ చైర్మన్ పదవి కట్టబెట్టడంపై కూటమిలో కుమ్ములాట మొదలైంది. ఆశావాహులు, సీనియర్ నేతలు ఈ పదవి కేటాయింపుపై నిప్పులు చెరుగుతున్నారు. మంగళవారం డీఆర్‌సీ మీటింగ్‌కు హాజరైనా జిల్లా రవాణాశాఖ మంత్రి రాం ప్రసాద్‌రెడ్డి ఎదుట ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్లీ అమాసకు ఎలా పదవి ఇస్తారంటూ నిలదీశారు. పార్టీకి కష్టపడిన వారికి ఇవ్వకుండా మళ్లీ అమాసకు ఇవ్వడం ఏమిటని ప్రశ్నల వర్షం కురిపించారు. చైర్మన్ పదవిని మార్చాలని భీష్మించారు. సీనియర్లకు ఇవ్వాల్సిందేనని గట్టిగా డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలోకి వచ్చేవారికి పదవులు ఇవ్వడం విడ్డూరమంటూ విరుచుపడ్డారు. దీంతో మంత్రి అధిష్టానం దృష్టికి తీసుకెళతానని వాళ్ల మధ్య నుంచి తప్పుకున్నారు.

చైర్మన్ ప్రమాణస్వీకారం వేళ..

డీసీసీబీ చైర్మన్ పదవి అమాసకు కేటాయించి, వారం రోజులు దాటింది. దీంతో చైర్మన్ పగ్గాలు చేపట్టేందుకు అమాస సిద్ధమవుతున్నారు. కార్యాలయానికి రంగులు వేయిస్తున్నారు. ఆయన చాంబర్‌కు కొత్త హంగులు దిద్దించుకుంటున్నారు. త్వరలో ప్రమాణా స్వీకారానికి ముహూర్తం ఖరారు చేయనున్నారు. ఈ తరుణంలో చైర్మన్ పదవిపై పేచీ పెట్టేందుకు కొందరు సిద్ధపడడం చర్చనీయాంశంగా మారింది. అమాసకు ఆ పదవి లేకుండా చేయాలని కొందరు బహిరంగంగా పట్టుబడడంతో అమాస వర్గం మల్లగుల్లలు పడుతోంది. ముహూర్తానికి ముందే మార్పునకు చూడాలని ఓ సీనియర్ నేత గట్టిగా పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. ఆ ప్రయత్నాలు ఏ మేరకు ఫలిస్తాయోనని ప్రేక్షక పాత్ర పోషిస్తున్న కూటమి నేతలు ఎదురుచూస్తున్నారు.

అధైర్యపడొద్దు... వచ్చేది మన ప్రభుత్వమే


కుప్పం నేతలతో మాట్లాడుతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- కుప్పం నేతలతో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

కుప్పంరూరల్: అధైర్య పడొద్దు... 2029లో వచ్చేది మన ప్రభుత్వమే.. ప్రతి కార్యకర్తకూ న్యాయం చేసే బాధ్యత నాది...అని వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కుప్పం నాయకులతో అన్నారు. శుక్రవారం విజయవాడలో ఆయన్ని కలిసి కుప్పం నాయకులతో సుదీర్ఘంగా చర్చించారు. అధికార పార్టీ నుంచి ఒత్తిళ్లు, దాడులు ఎక్కువయ్యాయని కుప్పం నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి ఎదుట వాపోయారు. ఈ సందర్భంగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఎవరు దిగులు చెందాల్సిన అవసరం లేదని, వచ్చేది మన ప్రభుత్వమే అని, ప్రతి ఒక్కరికీ న్యాయం చేసే బాధ్యత తనది చెప్పారు. ఎవరెవరు అన్యాయం చేశారో వారిని గుర్తు పెట్టుకోవాలని, వారికి రెండింతలు తిరిగి ఇస్తామని చెప్పారు. అధికారులైనా, నాయకులైనా ఎవరినినైనా వదిలేదిలేదన్నారు. అధికారులు రిటైర్డ్ అయినా, నాయకులు సముద్రాలకు అవతల వెళ్లి దాక్కున్న తీసుకువచ్చి శిక్ష వేస్తామని భరోసా ఇచ్చారు. స్థానిక ఇన్‌చార్జ్ స్థానికంగానే ఉండాలని ఆదేశించినట్లు సమాచారం. ఇటీవల కాలంలో దాడులకు గురైన వారిని ఒకసారి విజయవాడకు తీసుకురావాలని చెప్పినట్లు నాయకులు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎమ్మెల్సీ భరత్, సెంథిల్‌కుమార్, కుప్పం నియోజకవర్గ నాలుగు మండలాల నేతలు పాల్గొన్నారు.

కుప్పం సమస్యలు మాజీ సీఎం దృష్టికి..

బైరెడ్డిపల్లె: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కుప్పం నియోజకవర్గ ప్రజలపై జరుగుతున్న దాడులు, అక్రమ కేసులను కుప్పం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు మొగసాల రెడ్డెప్ప మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. విజయవాడలోని వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయంలో కుప్పం, రామకుప్పం మండలాలకు సంబంధించిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని, సమస్యలను మాజీ సీఎం దృష్టికి తీసుకువెళ్లారు.

అప్పుల బాధ తాళలేక యువ రైతు ఆత్మహత్య


లోకేష్ ఫోన్‌లో పెట్టిన స్టేటస్


సంఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

చౌడేపల్లి: అప్పుల బాధ తాళలేక యువరైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని ఎస్ అగ్రహారంలో గురువారం చోటు చేసకుంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని ఏ.కొత్తకోట పంచాయతీ ఎస్ అగ్రహారం గ్రామానికి చెందిన కమలాకర్, హేమలత దంపతులకు లోకేష్(27) కుమారుడు ఉన్నాడు. కమలాకర్ లారీ డ్రైవర్‌గా పనిచేసేవాడు. కొన్నేళ్ల కిందట పూణేలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కమలాకర్ మృతి చెందాడు. దీంతో లోకేష్ తన తల్లి హేమలతతో కలిసి వ్యవసాయం చేసుకుంటూ జీవని సాగించేవాడు. ఇటీవల తమ పొలంలోని 5ఎకరాల్లో టమాట పంట సాగు చేశాడు. పంట సాగు కోసం రూ.లక్షలు ఖర్చు చేశాడు. అలాగే ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. ఈఎంఐల తాకిడి అధికం కావడంతో ఆర్థిక భారం అధికమైంది. సాగు చేసిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో అప్పులు తీర్చలేక, ఈఎంఐలు కట్టలేక ఇబ్బందులు పడుతూ గ్రామంలో చీటీల నిర్వాహకుల నుంచి సైతం డబ్బులు తీసుకున్నాడు. అప్పులిచ్చిన వారి ఒత్తిళ్లు అధికం కావడంతో ఆ విషయం తల్లి హేమలతకు తెలియడంతో లోకేష్‌ను మందలించింది. దీంతో గ్రామానికి సమీపంలోని యల్లమ్మ గుంత సమీపంలోని చింతచెట్టుకు ఉరి వేసుకున్నాడు. చెట్టు కొమ్మకు వేళాడుతున్న లోకేష్ ను గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్ఐ నాగేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆత్మహత్యకు గల కారణాలపై విచారణ జరుపుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరుకు తరలించి తల్లి హేమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కంట తడిపెట్టించిన పోన్ స్టేటస్..

లోకేష్‌కు చెందిన ఐఫోన్‌లో స్టేటస్‌కు ఐయామ్ సారీ అంటూ దుఖంతో పెట్టిన స్టేటస్ చూసిన స్థానికులు, స్నేహితులు కన్నీటి పర్యంతమయ్యారు. లోకేష్ ఎంత పని చేశావయ్యా అంటూ రోదించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి సారూ!

- రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్‌కు అపస్ నేతల వినతి


వినతిపత్రం ఇస్తున్న ఆపస్ రాష్ట్ర అధ్యక్షులు బాలాజీ

చిత్తూరు కలెక్టరేట్ : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ కోరారు. గురువారం విజయవాడలో గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాల నేతలతో కమిషనర్ నిర్వహించిన సమావేశంలో ఆయన పలు సమస్యలపై చర్చించారు. అనంతరం రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజుకు ఆ సంఘం నేతలు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర అధ్యక్షులు బాలాజీ విలేకరులతో మాట్లాడారు. తొలుత హెడ్‌మాస్టర్ బదిలీలు, హెచ్‌ఎంల ఉద్యోగోన్నతులు, తర్వాత స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీల ఉద్యోగోన్నతులు బదిలీలు నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు సుముఖత చూపించారన్నారు. ఉద్యోగోన్నతుల ప్రక్రియలో ఖాళీలను గుర్తించాక 1:2 ప్రాతిపదికన సీనియార్టీ జాబితా ప్రకటించి, అందరూ ఆప్షన్లు పెట్టుకునేందుకు అవకాశం ఇస్తారన్నారు. రెండేళ్లలోపు ఉద్యోగ విరమణ పొందే వారుంటే మినహాయింపు ఇస్తారని చెప్పారు. స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ ఉద్యోగోన్నతులకు త్వరలో నిర్ణయం ప్రకటిస్తారన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఒకే ప్రాతిపదికన టీచర్లను కేటాయించాలని కోరినట్లు తెలిపారు. ప్రధానంగా ఫౌండేషన్ స్కూళ్లలో 1:20 ప్రకారం టీచర్లను నియమించాలని డిమాండ్ చేశామన్నారు. బేసిక్ ప్రైమరీ స్కూల్స్‌లో కనీసం ఇద్దరు టీచర్లు నియమించాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లను నియమించాలని కోరామన్నారు. ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 45 దాటితే అదనపు సెక్షన్ కింద పరిగణించాలన్నారు. ప్రతి 30 మంది విద్యార్థులకు రెండో సెక్షన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. తెలుగు మీడియం కొనసాగించాలన్నారు. ఉపాధ్యాయుల పని భారం 30 పీరియడ్లకు మించకుండా చర్యలు చేపట్టాలన్నారు. హైస్కూల్ ప్లస్ పీజీటీలకు రెగ్యులర్ ప్రాతిపదికన ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. 610 జీఓలో వివిధ జిల్లాల్లో 18 ఏళ్లుగా ఉద్యోగోన్నతులు లేకుండా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పీడీలకు న్యాయం చేయాలని కోరారు. పాఠశాల రోల్ మార్చి 31 నాటికి కాకుండా ఏప్రిల్ 7 వరకు తీసుకోవాలన్నారు. అంతర్ జిల్లాల బదిలీ సైతం నిర్వహించాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు.

యాదమరి పీహెచ్‌సీలో వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ వైద్యులు


ఆస్పత్రిలో వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ వైద్యులు

యాదమరి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ డాక్టర్ మౌనిక సందర్శించారు. గురువారం ఆమె మండలంలోని బుడిగిపెంట గ్రామానికి చెందిన విజయదీప్(14)అనే బాలుడిని పరిశీలించారు. రెండు నెలలు క్రితం పలురకాల ఆరోగ్య రుగ్మతలతో చిత్తూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందించారు. అక్కడ చికిత్స అనంతరం బాలుడికి సంబంధించిన ఆరోగ్య నివేదికలను జిల్లా వైద్యాధికారులు వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్‌కు పంపారు. బాలుడి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి క్రమంలో ఇక్కడికి వచ్చిన డాక్టర్.. కాన్పు సమయంలో అందించిన వ్యాధి నిరోధక టీకాలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాలుడికి ఎలాంటి సమస్య లేదని, కేవలం సైడ్ ఎఫెక్ట్స్ కారణంగా అతను కొంత కాలం పలు రుగ్మతలతో ఇబ్బంది పడ్డాడని, ఎటువంటి సమస్య లేదని తేల్చి చెప్పారు. అనంతరం గ్రామంలోని రెండేళ్లలోపు చిన్నారులకు అందించిన వాక్సినేషన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

న్యాయమూర్తులకు వేసవి సెలవులు

తిరుపతి లీగల్ : అదనపు జిల్లా జడ్జి కోర్టులకు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టులకు ఈ నెల 12 నుంచి జూన్ 13వ తేదీ వరకు రాష్ట్ర హైకోర్టు వేసవి సెలవులు ప్రకటించింది. ఇందులో భాగంగా న్యాయమూర్తులకు 14 రోజుల చొప్పున సెలవులిచ్చింది. ఈనెల 13 నుంచి ఈనెల 26వ తేదీ వరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా జడ్జి అరుణ సారిక, తిరుపతి నాల్గవ అదనపు జిల్లా జడ్జి జీ.అర్చన, తిరుపతి ఐదవ అదనపు జిల్లా జడ్జి రామ్‌గోపాల్, చిత్తూరు పోక్సో కోర్టు జడ్జి ఎం.శంకర్ రావు, తిరుపతి పదవ అదనపు జిల్లా జడ్జి టీ.రామచంద్రుడు, చిత్తూరు 8వ అదనపు జిల్లా జడ్జి సుంకర శ్రీదేవి, పీలేరు 9వ అదనపు జిల్లా జడ్జి ఏ మహేష్ సెలవు పై వెళ్లడానికి అనుమతిచ్చింది. అలాగే ఈనెల 30 నుంచి జూన్ 12వ తేదీ వరకు చిత్తూరు ఒకటవ అదనపు జిల్లా జడ్జి ఎస్.రమేష్, మదనపల్లి రెండవ అదనపు జిల్లా జడ్జి పీవీఎస్ సూర్యనారాయణమూర్తి, తిరుపతి మూడవ అదనపు జిల్లా జడ్జి ఎం.గురునాథ్, మదనపల్లి ఏడవ అదనపు జిల్లా జడ్జి ఆర్.శ్రీలత, చిత్తూరు 9వ అదనపు జిల్లా జడ్జి ఎస్.శ్రీనివాసరావు, తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ సెషన్స్ జడ్జి ఏ.నరసింహమూర్తి, శ్రీకాళహస్తి 12వ అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీనివాసులు నాయక్ వేసవి సెలవులపై వెళ్లడానికి అనుమతిచ్చింది. అదేవిధంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చిత్తూరు అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె.రవి, ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి ఎంఎస్.భారతి, మదనపల్లి అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఏ.శిరీష, పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి ఎస్సీ రాఘవేంద్ర, పుంగనూరు సీనియర్ సివిల్ జడ్జి ఆరిఫ్‌షేక్ ఈనెల 13 నుంచి 26వ తేదీ వరకు వేసవి సెలవులపై వెళ్లడానికి ఉమ్మడి చిత్తూరు జిల్లా జడ్జి అనుమతిచ్చింది. ఈనెల 30 నుంచి జూన్ 12వ తేదీ వరకు చిత్తూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి పద్మజ, మదనపల్లి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కె.జయలక్ష్మి, తిరుపతి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి డీ.విజయసారథి రాజు, తిరుపతి అదనపు సీనియర్ సివిల్ జడ్జ్ ఏ.సునీత రాణి, శ్రీకాళహస్తి సీనియర్ సివిల్ జడ్జి బేబీరాణి, పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి వీ.ఆదినారాయణ సెలవుపై వెళ్లడానికి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

రేషన్ బియ్యం స్వాధీనం

యాదమరి: అక్రమంగా నిల్వ ఉంచి 10 టన్నుల రేషన్ బియ్యాన్ని స్థానిక పోలీసులు దాడులు చేసి, స్వాధీనం చేసుకున్నారు. గురువారం మండలంలోని పుల్లయ్యగారిపల్లిలో పురుషోత్తం నాయుడికి సంబంధించిన ప్రైవేటు భవనాన్ని కొంత మంది మొక్కజొన్న వ్యాపారం చేస్తామని లీజుకు తీసుకున్నారు. అయితే అందులో యాదమరికి చెందిన అబ్దుల్ సలాం, పలమనేరుకు చెందిన చెంగల్ రాయులు, కర్ణాటకకు చెందిన రోషన్, ప్రదీప్ అనే వ్యక్తులు రేషన్ బియ్యం నిల్వ చేసి, అక్రమ రవాణా చేస్తున్నారని స్థానిక తహసీల్దార్‌కు గుర్తు తెలియని వ్యక్తులు సమాచారం ఇచ్చారు. దీంతో స్థానిక ఎస్ఐ ఈశ్వర్ తన బృందంతో మెరుపు దాడులు చేసి, ఆ భవనంలో నిల్వ ఉంచిన 10 టన్నుల రేషన్ బియ్యం, క్వాలిస్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కాగా ఈ అక్రమ రేషన్ బియ్యం నిల్వకు సంబంధించి నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పకడ్బందీగా ఆరోగ్య కార్యక్రమాలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుధారాణి ఆదేశించారు. గురువారం ఆమె చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో ఆ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. గర్భిణులకు పక్కాగా సేవలు అమలు చేయాలని సూచించారు. వారి నమోదు విషయంలో అలసత్వం వద్దని, ప్రసవ వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. జన ఔషధిని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని కోరారు.

విద్యుత్ షాక్‌తో రైతు దుర్మరణం

కుప్పంరూరల్: విద్యుత్ షాక్‌కు గురైన రైతు దుర్మరణం పాలైన సంఘటన కుప్పం మండలం, వసనాడు గ్రామంలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు .. వసనాడు గ్రామానికి చెందిన రైతు వెంకటేష్ (53) గురువారం రాత్రి కురిసిన గాలీవానకు పొలాల్లో పంట ఎలా ఉందోనని పరిశీలించేందుకు శుక్రవారం ఉదయం పొలం వద్దకు వెళ్లాడు. గాలీవానకు తెగిపడిన విద్యుత్ వైరును గుర్తించక పొలంలోకి వెళ్లడంతో షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారమందించి, ఆస్పత్రికి తరలించేందుకు యత్నించారు. అప్పటికే మృతి చెందినట్లు స్థానికులు చెప్పడంతో వెంకటేష్ కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. కాగా రైతు మృతిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు చెప్పారు.